# ప్రజల తీర్పును గౌరవిద్దాం



షాద్‌నగర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- షాద్‌నగర్ అభివృద్ధికి సహకరిస్తాం
- ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు
- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, డిసెంబర్5 : అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నమ్మకం కలుగడంతో ప్రజలకు ఆ పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించి ఉండవచ్చని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సేవ చేయాలంటే పదవులు అవసరం లేదని, ప్రజలకు అందుబాటులో ఉంటు వారి పక్షాన పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించుకోవడంతో పాటు రానున్న రోజుల్లో ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు. గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామన్నారు. పార్టీ గెలుపు కోసం కృషిచేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి రుణపడి ఉంటానని, బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈటె గణేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, నాయకులు వంకాయల నారాయణరెడ్డి, దేవేందర్‌యాదవ్, లక్ష్మణ్‌నాయక్, శ్రీధర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**బెదిరింపులకు పాల్పడితే గుణపాఠం తప్పదు**

కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా ప్రవరిస్తూ బీఆర్‌ఎస్ నాయకుల ఇండ్లపై దాడులు చేస్తు, బెదిరింపులకు పాల్పడుతున్నారని జడ్పీ వైస్ చైర్మన్ ఈటె గణేశ్ అన్నారు. మోత్కూలగూడ గ్రామంలో ఇంటిపై ముక్కుమూడిగా దాడి చేసి కార్యకర్త కుటుంబాన్ని చిత్రహింసలకు గురిచేశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గెలుపోటములు సహజమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు ఇలానే కొనసాగితే గుణపాఠం తప్పదన్నారు. అదేవిధంగా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు రౌడిల్లా వ్యవహరిస్తే చూస్తు ఊరుకోబోమని అన్నారు. ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్తను కాపాడుకుంటామని అన్నారు.

## అధైర్యపడొద్దు.. పిలిస్తే వస్తా..

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కొడంగల్, డిసెంబర్ 5 : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయామని ఆందోళనకు గురికావద్దని మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు చెప్పారు. మంగళవారం ఫోన్ ద్వారా మాజీ మంత్రి ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఓడినా.. గెలిచినా కేసీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉండి, ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. అధైర్యపడవద్దని, కష్టకాలంలో పిలిస్తే తప్పకుండా వస్తా అని అన్నారు. కేటీఆర్ ఫోన్‌కాల్‌తో బీఆర్‌ఎస్ నాయకుల్లో మళ్లీ సంతోషం కనిపించింది

## ఓటమెరుగని సబితారెడ్డి

కందుకూరు/ఆర్కేపురం/మహేశ్వరం, డిసెంబర్ 5 : బీఆర్‌ఎస్ పార్టీగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు వెలువెత్తున్నాయి. ఆమె ఇప్పటి వరకు ఓటమి ఎరుగదు. 5 పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తన భర్త మాజీ హోంమంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి మరణం తర్వాత చేవెళ్ల ఎమ్మెల్యేగా విజయం సాధించి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. అప్పటి నుంచి ఓటమి ఎరుగకుండా విజయం సాధిస్తూ వస్తున్నారు. రెండు పర్యాయాలు చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలిచారు. దీంతో ఆమె ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. దీంతో ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

***అభివృద్ధికి పట్టం..***

నియోజకవర్గం ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు. 5సంవత్సరాలుగా నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారు. నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల మధ్యనే ఉన్నారు. సబితా ఇంద్రారెడ్డి అంటే తెలవని ప్రజలు ఉండరు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నియోజకవర్గంలో ఎక్కడో ఎక చోట కనిపిస్తారు. రాష్ట్రం అంతట కాంగ్రెస్ గాలి వీచినా.. మహేశ్వరంలో మాత్రం సబితారెడ్డికి పట్టం కట్టారు.

***నియోజకవర్గ ప్రజల రుణపడి ఉంట***

మహేశ్వరం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సబితాఇంద్రారెడ్డి మంగళవారం ఆర్కేపురం డివిజన్‌లో పర్యటించారు. కార్తిక మాసం పురస్కరించుకుని ఆర్కేపురం పార్కులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యంగిరా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు నాగేశ్ ఉన్నారు.

***శుభాకాంక్షల వెల్లువ***

మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డిని మండలంలోని ర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు నగరంలోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు

## కృత్రిమ ఎరువులతో నేల సంరక్షణ



ప్రపంచ నేల దినోత్సవంలో పాల్గొన్న ఇషా ఫౌండేషన్ మెంబర్ జయశ్రీ, సర్పంచ్ తదితరులు

కొత్తూరు, డిసెంబర్ 5: కృత్రిమ ఎరువులు వాడటం ద్వారా నేల ఆరోగ్యంగా ఉంటుందని ఇషా ఫౌండేషన్ మెంబర్ డా. జయలేఖ అన్నారు. ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ దత్తత గ్రామం గూడూరులో ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇషా ఫౌండేషన్ మెంబర్ డా. జయలేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేలల్లో కర్బన శాతం 0.5 శాతం ఉందని చెప్పారు. దాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పచ్చరొట్ట ఎరువులు వాడటం ద్వారా నేల ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. రైతులు నత్రజని ఎరువుల వాడకం తగ్గించి కర్బన శాతం పెంచాలన్నారు. వ్యవసాయ కళాశాల ఏఈఎల్‌పీ విద్యార్థులు మట్టి నమూనా పరీక్ష విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో దత్తత గ్రామ కమిటీ చైర్మన్ డా. సి. నరేందర్‌రెడ్డి, మృత్తిక శాస్త్ర విభాగం అధినేత డా. జయశ్రీ, దత్తత గ్రామ కన్వీనర్ డా.రమేశ్, సర్పంచ్ బ్యాగరి సత్తయ్య, ఉప సర్పంచ్ దయానంద్, ఏఈవో అనిత, దత్తత గ్రామ కమిటీ సభ్యులు శైలజ, సమాతా పరమేశ్వరీ, అరుణ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం



స్వాములకు అన్నదానం చేస్తున్న శరత్‌బాబు

షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్ 5 : షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో అయ్యప్ప మాలదీక్షాపరులకు దాతల సహకరంతో 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం దండుశరత్‌బాబు సహకారంతో స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలోవిశ్వం, నందీశ్వర్, బసప్ప, భక్తులు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలి

కడ్తాల్, డిసెంబర్ 5 : ఆధార్ సెంటర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని ప్రజల సౌకర్యార్థం కడ్తాల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నూతన ఆధార్‌కార్డు కావాల్సిన వారు, కార్డులో మార్పులు, చేర్పులు కోసం, మొబైల్ నెంబర్ అప్డేట్ తదితర సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఆధార్ సెంబర్ అందుబాటులో ఉండనుందని ఆయన వివరించారు.

## హైనా దాడిలో లేగదూడలు మృత్యువాత

కొత్తూరు, డిసెంబర్ 5: హైనాల దాడిలో రెండు లేగ దూడలు మృతి చెందాయి. ఈ ఘటన కొత్తూరు మున్సిపాలిటీలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే మున్సిపాలిటీ పరిధిలోని తండా సమీపంలో నిర్మల తన పాలిచ్చే ఆవులు, వాటి దూడలను పొలంలో కట్టేసి ఇంటికి వచ్చింది. ఉదయం పాలు పితకడానికి తన తమ్ముడు విష్ణుతో పాటు వెళ్లింది. దూడలను ఏవో జంతువులు పీక్కుతిన్నట్లు గుర్తించింది. వెంటనే గ్రామంలో తెలియజేసింది. దూడలను చంపిన వాటిని చిరుతగా అనుమానించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. షాద్‌గనర్ ఫారెస్ట్ బీట్ అధికారి అజీజ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన పాదముద్రలు, దూడలను చంపిన తీరును బట్టి చిరుత కాదని, హైనాగా అనుమానిస్తున్నామని చెప్పారు. చిరుత దాడికి హైనా దాడికి తేడా ఉంటుందని చెప్పారు. చనిపోయిన లేగ దూడల పొట్ట భాగంలో ఒక వైపు మాత్రమే చీల్చినట్లుగా ఉందని అన్నారు. చిరుత మెడ, రెండు కాళ్ల మధ్యలో దాడి చేసి తింటుందని వివరించారు. చిరుత దాడిచేస్తే వాటి గోర్లు లేగ దూడకు ఇరువైపులా ఉంటాయని, కానీ ఒకే వైపు చీల్చినట్లు ఉందని అన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కడ్తాల్, డిసెంబర్ 5 : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ వనపర్తి డివిజన్ కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో అనేక రకాలుగా సేవలు అందిస్తున్న తపాలా ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చర్చించి పరిష్కారించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న డాక్‌సేవక్‌లకు ఎనిమిది గంటల పనిని, పెన్షన్‌తోపాటు అన్ని రకాల ప్రయోజనాలు చేయాలని పేర్కొన్నారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కి అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ ఈ నెల 12న అలిండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు.

## నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా



పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, డిసెంబర్ 5: ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి మరోసారి విజయం సాధించిన సందర్భంగా పలు కాలనీల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు వనస్థలిపురంలోని పనామా చౌరస్తాలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, నరహరిశెట్టి సుమంత్, మధుసాగర్, కిరణ్, బొలినేని రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

***ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ***

ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా మూడోసారి గెలుపొందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, డివిజన్ అధ్యక్షుడు సత్యంచారి, తదితరులు పాల్గొన్నారు.

– ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాగోల్ మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత, సీనియర్ నాయకుడు తూర్పాటి కృష్ణతో పాటు పలువురు సీనియర్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

– ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా బీఆర్‌ఎస్ హయత్‌నగర్‌కు చెందిన పలువురు నాయకులు, భారత్ జాగృతి ఎల్బీనగర్ నియోజకవర్గం నాయకులు, హయత్‌నగర్ శ్రీసాయి సెవెన్ సీటర్ ఆటో యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.